# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 19, అక్టోబర్ 2025

బాడీ బిల్డింగ్ పోటీలలో పతకాలు సాధించిన

## సింగరేణి కార్మికులు



బెల్లంపల్లి, ప్రభాతవార్త

మహారాష్ట్రలోని నాగపూర్ లో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగిన కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో సింగరేణి కార్మికులు పతకాలు సాధించారు. 75 కిలోల విభాగంలో జనగామ మొగిలి రజత పతకం సాధించగా, పెసరి అర్జున్ 70 కిలోల విభాగంలో కంచు పతకం సాధించారు. వీరు పతకాలు సాధించడంతో బెల్లంపల్లి స్కై జిమ్ నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.






# బీసీ బంద్ విజయవంతం

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతంగా కొనసాగింది. బీసీలకు 42 రిజర్వేషన్ పట్ల ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ పలు పార్టీలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో బంద్ పాటించారు. బంద్ ప్రభావంతో వ్యాపార సముదాయాలు, పాఠశాలలు మూసి వేశారు. కొంతమేరకు రవాణా ఇబ్బందులు ఏర్పడ్డాయి. బంద్‌లో పలు పార్టీల నాయకులు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

✶ నిరసనలు తెలిపిన రాజకీయ నాయకులు

✶ మద్దతు తెలిపిన ప్రజా, వ్యాపార సంఘాలు ✶ డిపోలకు పరిమితమైన బస్సులు

లోపలి పేజీల్లో..



ఆదివాసీ సాంప్రదాయాలతో

## పూజలు చేసిన జిల్లా ఎస్పీ

సిరికొండ, ప్రభాతవార్త

సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అచల్ మహాజన్ గుస్సాడీ దండారి వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆదివాసీలు డోలు వాయిద్యాలతో జిల్లా ఎస్పీ అచల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ కాజల్ సింగ్‌లకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా ఎస్పీ అచల్ మహాజన్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం తలకు పాగా చుట్టుకుని ఆదివాసీల దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పి, ఏఎస్పీ ఆదివాసీలతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదివాసీలకు విద్య, ఆరోగ్యం వంటి విషయాలపై అవగాహన కల్పించి, వారి పురోగతిని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ, ఏఎస్పీ మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, ప్రభాతవార్త

నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేకించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన అభివృద్ధి పనులు, ఆస్తి పన్నులు వసూలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరు కాబడి పనులు ప్రారంభం కానీ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించేలా మిగతా 2లో..

## మహిళ దారుణ హత్య

### కోడలిని హత్య చేసిన మామ



రాణి (ఫైల్)

దహెగాం, ప్రభాతవార్త

మహిళ దారుణ హత్యకు గురైనట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదోద్దిన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని గెర్రే గ్రామానికి చెందిన సత్తయ్య కుమారుడు కుమార్ ప్రేమ వివాహం చేసుకున్నాడని, ఇష్టంలేని పెళ్లి చేసుకున్నాడని కారణంతో కోడలు రాణి (శ్రావణి)ని మామ గొడ్డలితో హత్య చేసాడని తెలియజేసారు. మృతురాలు తండ్రి చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు సత్తయ్య, కుమార్, కవిత పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయనతో పాటు సీఐ కుమారస్వామి, పెంచికల్ పేట్ మండల ఎస్ఐ అనిల్, దహెగాం తహసీల్దార్ మునవీర్ షరీఫ్ తదితరులు ఉన్నారు.



### ఆదివాసీ సాంప్రదాయాలతో

## పూజలు చేసిన జిల్లా ఎస్పీ

*(మొదటిపేజీ తరువాయి)*

ఆదివాసులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడాం శంకర్, మహాజన్ అమృతరావ్, దేవరీ ప్రహ్లాద్, మాజీ ఎంపీపీ పెందూర్ అమృతరావ్, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, ఆదివాసీలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

*(మొదటిపేజీ తరువాయి)*

చూడాలని, బేస్మెంట్, లెంటల్, స్లాబ్‌ల స్థాయిలవారీగా జరిగిన నిర్మాణ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఫోటోలను పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. వివిధ కారణాలతో నిలుపుదల జరిగిన లబ్ధిదారుల వివరాలతో జాబితా రూపొందించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేయాలని, మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించాలని, ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపాలిటీలకు సంబంధించి అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో అనధికార నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మురుగు కాలువల నిర్మాణాలలో సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై అధికారులు శ్రద్ధ వహించాలని, నివాస ప్రాంతాలు, మురుగు కాలువలు, అంతర్గత రహదారులపై ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించేలా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్ మోహన్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. బన్సీలాల్, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అగరుగూడలో నాసిరకం రేషన్ బియ్యం పంపిణీ

### - ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు

పెంచికల్ పేట్, ప్రభాతవార్త

పెంచికల్ పేట్ మండలంలోని అగర్గుడా గ్రామంలో రేషన్ దుకాణం ద్వారా నాసిరకం నూకలు, ముక్కిన బియ్యం పంపిణి చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శనివారం పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు డిటి శ్రీనివాస్ టెక్నీకల్ అసిస్టెంట్ రాజ్ కుమార్ లు అగర్గుడా గ్రామములోని బియ్యం పంపిణి కేంద్రాన్ని సందర్శించి భౌతిక నిలువలను తనిఖీలు చేసి బియ్యం శాంపిల్స్ నమూనాలను సేకరించారు.టెస్టింగ్ కోసం పౌరసరఫరాల శాఖా హైదరాబాద్ ల్యాబ్ కి పంపించి రిపోర్టు అనంతరం పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు. ఈ సందర్బంగా అగర్గుడా గ్రామస్థులు మాట్లాడుతూ నాసిరకం బియ్యాన్ని ప్రజలు, చిన్నపిల్లలు, గర్భవుతులు తినడం వలన అనేక రకాల వ్యాధులపాలై అనారోగ్యం భారిన పడతామని నాణ్యత కలిగిన బియ్యాన్ని పంపిణి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అనంతరం డిటి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గోదాం నుండి పరిక్షించి నాణ్యవంతమైన బియ్యాన్ని అందించామని కానీ ఇక్కడ ఉన్న నిల్వలో ఇలాంటి నాసిరకం బియ్యం ఉండటం విడ్డురంగా ఉందని అన్నారు. హైదరాబాద్ ల్యాబ్ రిపోర్ట్ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమములో గిర్ధావర్ రాజేశ్వర్ అగర్గుడా తాజా మాజీ సర్పంచ్ పాలే సుధాకర్ గ్రామ యువకులు ప్రజలు పాల్గొన్నారు.



# హెచ్ఐవి నియంత్రణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా హెచ్ఐవి నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్‌లతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రజలకు వ్యాధి పట్ల ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను రూపుమాపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని పరీక్షలతో పాటు హెచ్ఐవి, ఎస్‌టిఐ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. యువత హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నియంత్రణలో భాగస్వాములై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఒ వెంకటేశ్వర్లు, సిహెచ్ఒ నామ్ దేవ్, వైద్యాధికారులు, ఐసిటిసి కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

పెంచికల్‌పేట్, అక్టోబర్ 18, ప్రభాతవార్త

ఎన్నికల సందర్భంగా అమలు గాని హామీలు ఇచ్చి బాకీ పడ్డ కాంగ్రెస్ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బిట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎల్లూర్, కోయాచిచ్చల గ్రామాలలో శనివారం కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 13హామీలు, 420వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని. ఇందులో ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలకావస్తున్న సక్రమంగా రైతుబంధు ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారని, రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను దళారుల చుట్టూ తింపి ఇబ్బందులకు గురిచేశారాని, ఇక యూరియా పంపిణీ విషయానికి వస్తే రైతుల పడ్డ గోసలు రాష్ట్రవ్యాప్తంగా తెలుసాని అన్నారు. గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో యూరియా కోసం రైతులు ఏనాడు క్యూలైన్లు కట్టలేదని ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింట సౌభాగ్యం కాదు దౌర్భాగ్యంలా మారిందన్నారు. 500 గ్యాస్ అటకెక్కిందని, మహిళలకు అందించే 2500 ఊసులేదని, ఉచిత బస్సు పెట్టి తలలు పట్టుకొని కొట్టుకునేలా చేశారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆసుపత్రులు నిలిపివేయడంతో లక్షల మందికి వైద్య చికిత్సలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే 420 వాగ్దానాల్లో ఏ ఒక్కటి పూర్తి కాలేదన్నారు చివరకు 42 బీసీల రిజర్వేషన్లు ఇవ్వడంలో కూడ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నేడు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో నేడు రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బంద్ కు మండల బిఆర్ఎస్ పార్టీ నుండి సంపూర్ణ మద్దతు తెలుపుతూన్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

### - మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

వేమనపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త



నీల్వాయి గ్రామానికి చెందిన ఏట మధుకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా శనివారం వారి దినఖర్మకు హాజరై వారి కుటుంబ సభ్యులను బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల వేధింపుల కారణంగా మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అన్ని మండలాలలో ప్రస్తుతం రాక్షస పాలన కొనసాగుతున్నదని, రాజకీయ వేధింపులకు ఎవరూ మనోవేదనకు గురికావద్దని, నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమకు తెలియచేయాలని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజాసేవకై తామెప్పుడూ సంసిద్ధంగా ఉంటామని తెలిపారు. వీరితో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోలి వేణు మాధవ్ రావు, పురాణం లక్ష్మీకాంత్, కుబిడే వెంకటేష్, కొండగొర్ల బాపు, తలండి భీమయ్య, బోర్కుటి సంతోష్, బెడ్డల రాజలింగు, రుద్రబట్ల లక్ష్మీనారాయణ, దుర్గం సక్కుబాయి, పల్లె రమేష్, గొంతు మేర, కొండల్ రెడ్డి, బుర్రి రమేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మధుకర్ కుటుంబానికి భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడి పరామర్శ

వేమనపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త

తమ పార్టీ మండల అధ్యక్షులు ఏట మధుకర్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, పోలీసులతో కలిసి అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ అత్యాచారయత్నం కింద కేసు నమోదు చేయడంతో మానసిక వేదనను బరించలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మధుకర్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే, ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని రఘునందన్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించే సత్తా ఉన్న నాయకుడు మధుకర్ అని అందుకే అతడిని అడ్డు తొలగించుకునేందుకు అక్రమ కేసులు పెట్టించారన్నారు. అందుకు కారకులైన వారిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని అన్నారు. వీరి వెంట జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, దుర్గం అశోక్, కొయ్యల హేమాజీ, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# బంద్ ప్రశాంతంగా సంపూర్ణం





**సిరికొండ, ప్రభాతవార్త**

42 శాతం బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం బంద్ విజయవంతమైంది. వ్యాపార సంస్థల యజమానులు స్వచ్ఛందంగా మద్దతు పలుకు వ్యాపార సంస్థలను మూసివేశారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మూసివేశారు. వివిధ పార్టీల నాయకులు బీసీ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహిస్తూ ఇప్పటికైనా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**దహెగాం, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

బీసీల రిజర్వేషన్ల కొరకు చేపట్టిన బీసీ బంద్ దహెగాం మండలంలో ప్రశాంతంగా జరిగింది. అత్యవసర సేవలు మినహాయించి మిగతా రంగాలన్నీ బంద్ పాటించాయి. బీసీ నాయకులు బంద్‌కు అన్ని రంగాల వారు సహకరించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కొరకు చేపట్టిన బంద్‌కు వ్యాపారస్థులు, పాఠశాలలు స్వచ్ఛందంగా పూర్తి మద్దతు తెలిపారు. ఈ బంద్‌లో తిరుపతి గౌడ్, రాజన్న, మధుకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

**వేమనపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

బీసీల రిజర్వేషన్ల కొరకు చేపట్టిన బీసీ బంద్ శనివారం వేమనపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగింది. అత్యవసర సేవలు మినహాయించి మిగతా రంగాలన్నీ బంద్ పాటించాయి. బీసీ నాయకులు బంద్‌కు అన్ని రంగాల వారు సహకరించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కొరకు చేపట్టిన బంద్‌కు వ్యాపారస్థులు, పాఠశాలలు, స్వచ్ఛందంగా పూర్తి మద్దతు తెలిపారు. బీసీ బంద్ నేపథ్యంలో ఆదిలాబాద్ వెళ్ళవలసిన ఆదిలాబాద్ నీల్వాయి ఎక్స్‌ప్రెస్ బస్సును నీల్వాయిలోనే నిలిపివేశారు. మరోవైపు దీపావళి పండుగతో పాటు వారంతపు సెలవులు ఉండడంతో వివిధ గ్రామాలకు వెళ్ళవలసిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ బంద్‌లో సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీకాంత్, కుబిడే వెంకటేశం, ముల్కల్ల సత్యనారాయణ, శ్రీశైలం, చిగురాల లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**తిర్యాని, అక్టోబర్18, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలో బీసీ రిజెర్వేషన్ పెంపునకు మద్దతుగా శనివారం తలపెట్టిన బంద్ కార్యక్రమం విజయవంతం అయింది. మండలంలోని వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీసీ రిజెర్వేషన్ కు మద్దతుగా నినాదాలిస్తూ ర్యాలీగా బయలు దేరి తమ మద్దతును తెలిపారు. బంద్ ప్రభావతంతో బస్సులు, ఆటోలు తిరగక పోవడంతో రాకపోకలు తగ్గాయి. కాగా ఈ బంద్ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తిర్యాని ఎస్సై వెంకటేష్ ఆద్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

**బీసీలను అవమాన పరిచేది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే...**

బీసీలను అవమాన పరిచేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనని బీఆర్ఎస్ తిర్యాని మండల సీనియర్ నాయకులు ముత్యం రాజయ్య ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 56శాతం పైగా ఉన్న 42శాతం బీసీలకు రిజరేషన్లు ఇచ్చేందుకు బీజేపి, కాంగ్రేస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. బీసీలు అందరూ ఐక్యంగా ఉండి బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**బీసీలను అణచివేయడమే బీజేపి,బీఆర్ఎస్‌ల లక్ష్యం...**

బీసీలను అణచివేయడమే బీజేపి, బీఆర్ఎస్ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని తిర్యాని మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు చిత్తారి సాగర్, సీనియర్ నాయకులు బుద్దె విజయ్‌లు ఆరోపించారు. బీసీలను మొదట అణిచివేసింది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీ రిజర్వేషన్లను కుదించారని అలాగే బీసీలకు సంబంధించిన బిల్లు గవర్నర్ వద్ద ఆమోదం పొందకుండా ఆపేస్తున్నది బీజేపి పార్టీనేనని వారు విమర్శించారు. బీసీల అభివృద్ధికి కాంగ్రేస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు. బీసీ సామజిక వర్గం ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని వారు కోరారు.

**బీసీ రిజర్వేషన్ బిల్లు అమలుకు బీజేపి పార్టి కట్టుబడి ఉంది...**

బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపి పార్టి కట్టుబడి ఉందని తిర్యాని మండల బీజేపి పార్టి అధ్యక్షులు సార రమేష్ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రేస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ పేరుతో డొల్ల నిర్ణయాలు తీసుకుని స్థానిక ఎన్నికలను ఆపివేయడమే కాంగ్రేస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన విమర్శించారు. దేశ, రాష్ట్రాల అభివృద్దే బీజేపి పార్టి లక్ష్యమన్నారు. బీసీ సామాజికవర్గం మేలుకొని తమ రిజర్వేషన్లను సాధించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ బంద్ కార్యక్రమంలో మండలంలోని ఆయా రాజకీయ పార్టిల నాయకులు, కార్యకర్తలు, బీసీ సామాజిక వర్గం నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల నాయకులు తెలంగాణ లో తలపెట్టిన బీసి సంఘాల ఐక్యతను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసి సోదరులు రాజకీయంగా సామాజికంగా ఉద్యోగ పరంగా చాలా వెనుకబడి ఉన్నారని, మనదేశంలో బీసీలు అణగ దొక్క బడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీ మేము పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ గవర్నర్ ఆమోదం తెలుపక, కేంద్రం ఆమోదం తెలుపక స్థానిక ఎన్నికలకు వెళ్లడం కాంగ్రెస్ పార్టీకి తెలుసని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలందరూ ఆలోచిస్తున్నారని, అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని అవకాశం వస్తే ఓటుతో బుద్ధి చెప్తా అనుకుంటున్నారని ఆయన కొనియాడారు. భూమన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్ భూటకపు నాటకం అని గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా కేంద్రం ఆమోదం తెలుపకుండా కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ ప్రజలను మభ్యపెడుతుంది అని ఆయన అన్నారు. చిత్తశుద్ధితో అన్ని కోణల్లో ఆలోచించి 42 శాతం బీసీలకు న్యాయం చేయాలని అన్నారు. మండల సీనియర్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, వామపక్షాలు పార్టీలు మద్దతు అని అంటున్నారు కానీ బీసీలు అందరూ ఐక్యమత్యంగా తలుచుకుంటే కేంద్రంపై రాష్ట్రంపై ఒత్తిడి తీసుకురావచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కానందే రాజారాం, మండల సీనియర్ నాయకులు చిలుకూరి భూమన్న, భాస్కర్ రెడ్డి యువ నాయకులు సుభాష్ నాయక్, అక్షయ్, శరత్ కృష్ణ, జ్ఞానేశ్వర్, కవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత వస్తు ప్రదర్శనతో అవగాహన పెరుగుతుంది

**- జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ - కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ హిత వస్తు ప్రదర్శన కార్యక్రమం**

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

పర్యావరణ హిత వస్తు ప్రదర్శన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ప్రజలలో అవగాహన పెరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వ పర్యావరణ, అటవి మంత్రిత్వశాఖ సహకారంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ హిత వస్తు ప్రదర్శన ఘనంగా జరిగింది. కళాశాల విద్యార్థులు పర్యావరణ అనుకూల వస్తువులతో స్వయంగా తయారు చేసిన పలు రకాల వస్తువులను ప్రదర్శించారు. మొత్తం 18 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి పర్యావరణ కాలుష్యం పెరిగిపోవడం వలన అనేక అనర్ధాలు సంభవిస్తున్నాయని కాబట్టి పర్యావరణానికి హాని కలిగించని వస్తువులు ఉపయోగించి విద్యార్థులు అనేక రకాల వస్తువులు తయారు చేసి ప్రదర్శించడం వలన ప్రతీ ఒక్కరికి పర్యావరణ పట్ల అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీదేవి మాట్లాడుతూ పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని ఉద్దేశంతో ఇలాంటి వినూత్న ప్రదర్శనను కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు కళాశాల ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి దేవేందర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను ఉపయోగించి వివిధ రకాలైనటువంటి ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శించడం ద్వారా విద్యార్థులతో పాటు ప్రజలకు కూడా పర్యావరణం పట్ల అవగాహన కల్పించే కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి అనేక రకాల ఆరోగ్యకరమైన తినుబండారాలతో పాటు పరిసరాలలో లభించే వస్తువులను సేకరించి నూతన ఉత్పత్తులను తయారు చేసి ప్రదర్శించడం పలువురిని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ప్రభుత్వ జూనియర్ కళాశాల, నవోదయ అధ్యాపకులు, విద్యార్థులు సైతం సందర్శించి విద్యార్థులు తయారు చేసిన పలు రకాల వస్తువులను కొనుగోలు చేసి విద్యార్థుల కృషిని ప్రశంసించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. డి లక్ష్మినర్సింహం, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్



డి. జనార్దన్, అధ్యాపకులు ఎం. రాజేశ్వర్, బి వెంకటేశం, ఎస్ వెంకటేశ్వర్లు టి, దత్తాత్రేయ, రోజ్ మేరీ, కృష్ణవేణి డాక్టర్ టేమాజీ పాల్గొన్నారు.

# బీసీ బంద్ విజయవంతం



**బెల్లంపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు శనివారం రోజున బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన బంద్ లో భాగంగా బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో బంద్ విజయవంతమైంది. డివిజన్ కేంద్రమైన బెల్లంపల్లి లో వ్యాపార వాణిద్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు. ఉదయం నుంచి మధ్యానం వరకు ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాలు నడవ లేదు. పట్టణంలో పూర్తిగా రవాణా స్థంభించి పోయింది. ఆర్టీసీ బస్సులు పాక్షికంగా నడిచాయి. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలు బంద్ పాటించాయి. బెల్లంపల్లి పట్టణంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా, పాత రామా టాకీస్ చౌరస్తాలలో రాస్తా రోఖో నిర్వహించారు. ఈ సందర్బంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ, బీసీ జేఏసీ నాయకులు మాజీ మున్సిపల్ మత్తమారి సూరిబాబు, మాజీ వైస్ చైర్మెన్ బత్తుల సుదర్శన్, సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గెల్లి జెయరామ్ యాదవ్, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ టీ. మానిరామ్ సింగ్‌లు మాట్లాడారు. రిజర్వేషన్ పై హైకోర్టు, సుప్రీం కోర్టు ద్వారా బీసీ బిల్లు అమలు కాకపోవడంతో రానున్న రోజుల్లో బీసీలు అన్నిరంగాల్లో రిజర్వేషన్లు కోల్పోతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు కేంద్ర ప్రభుత్వం పై పోరాడాలన్నారు. ఈ విశయంపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మునిమంద రమేష్, దావ రమేష్ బాబు, కొలిపాక శ్రీనివాస్, రామచంద్రం, బొంతల లక్ష్మి నారాయణ, తిలక్ అంబేద్కర్, గుండా ప్రశాంత్, బొల్లు మల్లయ్య, జీవరత్నం, గైని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**బీసి బంద్‌కు సింగరేణి పవర్ ప్లాంట్ బీసి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల మద్దతు**

**జైపూర్, అక్టోబర్ 18,ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం తల పెట్టిన బీసీ బంద్ కు సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లోని బిసి, ఓబిసి ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎస్.సి, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరూ కలసి ఎస్టిపిపి జీఎం. ఎం నరసింహారావుకు తమ డిమాండ్లను తెలియజేస్తూ మెమోరాండం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతున్న దశాబ్దాలుగా బీసీ వర్గాలకు తగిన రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందడం లేదని, అన్ని రకాలుగా నష్టపోయారని అన్నారు. బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో బీసీలకు ఇటీవల బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో నెంబర్ 9 ని విడుదల చేయగా, కొంతమంది నాయకులు రిజర్వేషన్ అడ్డుకునేందుకు కోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. బీసీ వర్గాల ఆత్మగౌరవంతో పాటు, దామాషా పద్దతిన చట్టసభల్లో రాజ్యాంగ పదవులు సాధించడం భవిష్యత్తులో బీసీల రాజ్యమే ధ్యేయంగా ముందుకు కదలాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(పిసిఎస్) చీఫ్ (ఓఎం) మదన్మోహన్, ఎస్టిపిపి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ జి శ్రీనివాస్, సింగరేణి ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి. పంతులా, ఎస్టిపిపి ఎస్సీ లైసెనింగ్ ఆఫీసర్ వెంకటయ్య, డీజీఎం (వాటర్ సిస్టమ్స్) జనగామ శ్రీనివాస్, డిజీఎం(ఆపరేషన్స్) సంతోష్ కుమార్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.



**కాగజ్‌నగర్, అక్టోబర్ 18,ప్రభాతవార్త**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసిలకు జరుగుతున్న అన్యాయం ఎండగడుతూ చావో రేవో తెలుసుకోనే సమయం ఆసన్నమైందని కావున బీసిలందరూ ఐక్యతా ఉండాలని బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. శనివారం రాష్ట్ర నాయకులు తెలంగాణ బంద్ పిలుపులో భాగంగా కాగజ్‌నగర్ బంద్ పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ బంద్‌కు అన్ని కుల సంఘాలు,రాష్ట్రంలో ఉన్నా బీఆర్ఎస్, బిజెపి, ఎంఆర్‌పిఎస్, సిపిఎం, సిపిఐ పార్టీలు,సీనియర్ సిటిజన్స్,వ్యాపారులు పూర్తిగా మద్దతు తెలిపారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బంద్ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, లెండుగురె శ్యామ్‌రావు, కొంగ సత్యనారాయణ, గోలేం వెంకటేష్, పొన్న రమేష్, సుంకరి తిరుపతి, వీర బద్రచారి, గుల్లపలి నాగేశ్వరరావు,రమనయ్య, షబ్బీర్ హుస్సేన్,,గడదాసు మల్లయ్య,,మేరాజు,మంత్రి మల్లేష్, కీర్తి శ్రీనివాస్,నక్క మనోహర్, శ్రీనివాస్ గౌడ్,కోప్పుల శంకర్ ఠాకూర్ విజయ సింగ్, ఇస్తారు,తదితరులు పాల్గొన్నారు.



**ఆసిఫాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

బీసీలకు రిజర్వేషన్లలో న్యాయమైన వాటా కోసం బీసీ ఐకాస చేపట్టిన బంద్ శనివారం కుమురం భీం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. అత్యవసర సేవలు మినహా మిగతా రంగాలన్నీ బంద్ పాటించాయి. బీసీలకు 42 రిజర్వేషన్ల అమలు కోసం చేపట్టిన బంద్ కు మద్దతుగా జిల్లాలో సీపీఐ సీపీయం నేతలు నిరసన చేపట్టారు. రిజర్వేషన్ల అమలు కోసం ఉదయం నుండి పట్టణంలోని పలు విధుల గుండా బీసీ నాయకులు తిరుగుతూ బంద్ కు సహకరించాలని కోరారు. ర్యాలీలు, రాస్తా రోఖోలు నిర్వహించారు. దీంతో పట్టణం లోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బీసీ బంద్ నేపథ్యంలో బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బస్సులు బయటికి రాక డిపోకు పరిమితమయ్యాయి. మరోవైపు దీపావళి పండుగతో పాటు వారాంతపు సెలవులు ఉండడంతో వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో రద్దీ పెరిగింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్ స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు, వయోవృద్ధులతో గంటల తరబడి బస్ స్టేషన్‌లో వేచిఉన్నట్లు ప్రయాణికులు తెలిపారు. మరోవైపు ఇదే అదనుగా ఆటో డ్రైవర్లు ప్రజల నుండి అధిక మొత్తంలో వసూలు చేశారు. దీంతో ఆర్టీసీ నష్టపోయింది.

**పెంచికల్‌పేట్, జైపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కొరకు బీసీ జెఏసి పిలుపుమేరకు శనివారం పెంచికల్‌పేట్, జైపూర్ మండల కేంద్రాల్లో అఖిలపక్ష నాయకులురోడ్డుపై బైటాయించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల కేంద్రంలో బంద్ శాంతియుతంగా ముగిసింది.ఆయా పార్టీ శ్రేణులు,సంఘాల నాయకులు, వ్యాపారస్తులు బంద్‌కు సంపూర్ణంగా మద్దతు తెలిపారు. బీసీ జెఏసి నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు సాధించేవరకు బిసిలందరు ఐక్యంగా ఉంటూ పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు మార్త మారుతీ, వేముల మల్లేష్, ఆవిడపు గణేష్, మహమ్మద్ ఫయాజ్,అరికె సంతోష్ యాదవ్, గడ్డం సతీష్ గౌడ్, జక్కుల వెంకటేష్,సుంకరి శ్రీనివాస్,బత్తుల శ్రీనివాస్ యాదవ్,మున్నా భాయ్,డేగ నగేష్,ఇజ్జగిరి సమ్మయ్య, గుండు రాజేష్, దుగుట రాజ్ కుమార్, శీలం వెంకటేష్, మంతెన లక్షుఋఋ్మణ్, రామగిరి రాము, వెంకటేశ్వర్లుగౌడ్, వొడ్నాల మల్లేష్,శ్రీనివాస్ గౌడ్,తాటి రామగౌడ్, తిరుపతి రాజు, కల్కి రమేష్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త**

శనివారం మండల కేంద్రంలో బీసీల బంధు విజయవంతమైంది బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్ల పై కోర్టు స్టే ఇవ్వడని నిరసిస్తూ బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకత్వం ఈరోజు బంద్‌కు పిలుపునివ్వడంతో బీసీ సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఇప్పటికే అచలపక్ష పార్టీలు బీసీ బంద్ యొక్క మద్దతు ప్రకటించి నందున విద్యా, వ్యాపార సంస్థలు, ఆర్టీసీ యాజమాన్యం, హోటల్లు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాయి. ఈ బంద్‌లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్తం నాయక్, గోగర్ల రాజయ్య, కంబాల వినేష్, కొట్రాంగే తిరుపతి, మొహర్లే నాగేష్ పాల్గొన్నారు.










# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**




నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధి పొందిన వారు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పాటు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లలో పనులు మొదలు పెట్టని 2745 ఇండ్లకు సంబంధించి ఈ నెల 23వ తేదీ వరకు పనులు ప్రారంభించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పి.వి.పి.జి లకు మంజూరైన ఇళ్లను త్వరగా పనులు ప్రారంభించాలని తెలిపారు. మండల సమాఖ్య నుండి లబ్ధిదారులకు కొంత రుణం అందించాలని, గ్రామపంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్నులు వసూలు చేయాలని, గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. వర్షాకాలం ముగిసినందున గ్రామాలలో రహదారులపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని, జిల్లాలోని వారసంతలను వేలంలో దక్కించుకున్న వారి నుండి వాయిదా సొమ్మును వసూలు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లు లేని గృహాలను గుర్తించి జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. పంచాయితీ కార్యదర్శుల హాజరుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి వేణుగోపాల్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరెగూడ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడె నందు ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో కుడుదుల రాజన్ బాబు కుడుదుల స్వరూప కూతురు నిహారిక జ్ఞాపకార్థంగా విద్యార్థులకు 105 ప్లేట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతుగా తోడ్పాటు అందించడం అభినందనీయమని అన్నారు. ప్లేట్లు అందజేసిన రాజన్‌బాబు స్వరూపలకు ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రవి, గ్రామ మాజీ సర్పంచ్ పురుషోత్తం, ఉప సర్పంచ్ సంతోష్, గ్రామ పెద్దలు సోమయ్య, వసంతరావు, గణపతి, దాము, తిరుపతి, శ్రీకాంత్, దేవేందర్, రమేష్, ప్రకాష్, రవీందర్, రాజు, నానాజీ సురేందర్, తిరుపతి, సాయి, తార, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు



## ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

### - 108, 102 సేవల విభాగ మేనేజర్ నరేష్ యాదవ్

**తిర్యాని, అక్టోబర్18, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని 108,102 అంబులెన్స్‌ల అత్యవసర సేవల విభాగ మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్ అన్నారు. శనివారం తిర్యాని మండలంలోని అత్యవసర సేవల విభాగంలోని 108,102 అంబులెన్స్‌లను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించి వాహనాల మెంటెనెన్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గిరిజనులకు 24 గంటలు అంబులెన్స్ లో అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సిబ్బందికి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని సూచించినట్లు తెలిపారు. చరవాణిలో సమాచారం అందిన వెంటనే సిబ్బంది స్పందించి అంబులెన్‌ను త్వరితగతిన పేషేంట్ దగ్గరికి తీసుకు వెళ్లాల్సిందిగా కోరారు. తిర్యాని వైద్యాధికారి అక్షిత్ తో కలిసి అంబులెన్స్ స్థితిగతులు, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహనాల పైలెట్లు దినేష్, కళ్యాణ్, మెడికల్ టెక్నీషియన్ అన్వేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

### - ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సిర్పూర్(టి)మండలం చీలపెల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే హరీష్‌బాబు బీజేపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ నడుంబిగించి పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

**జైపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను శనివారం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించగా న్యాయ నిర్ణేతగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ హాజరయ్యారు. 202425 సంవత్సరంలో మొత్తం 393 పనులకు వేతన, మెటీరియల్ మొత్తం గాను రూ.6,00,66896 ఖర్చు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ఇంప్లిమెంట్ చేయడంలో ఈజీఎస్ సిబ్బంది చిన్న చిన్న పొరపాట్లకు గాను ఇకపై జరగకుండా సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బాపు రావు, విజిలెన్స్ అధికారి కిరణ్, తహశీల్దార్ వనజ రెడ్డి, సోషల్ అడిట్ ఎస్టిఎం వేణు, ఎస్ఆర్పి రవి, డిఆర్పి, విఎస్ఏ, ఏపిఓ, ఈసి, పంచాయతీ కార్యదర్శులు, వేతన కూలీలు పాల్గొన్నారు.

## స్వర్ణ వాగులో పడి వ్యక్తి మృతి

**సారంగాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



మండలంలోని ప్యారామూర్ గ్రామానికి చెందిన పగుడపు భోజన్న (59) అనే వ్యక్తి స్వర్ణ వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా భోజన్న మతిస్థిమితం సరిగా లేక గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఇటీవల అతని అక్క అతన్ని బోరిగాం గ్రామానికి తీసుకెళ్లి సంరక్షణలో ఉంచింది. అయితే శుక్రవారం సాయంత్రం నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతని కోసం చుట్టు పక్కల వారిని అడిగినారు. ఎవరుకనబడలలేదని అనడంతో చుట్టాలకు ఫోన్ చేసి వాకబు చేశారు. కాగా కొందరు శనివారం ఉదయం స్వర్ణ వాగులో మృతదేహం కనిపించింది చెప్పారు అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, పిల్లలు ఎవరూ లేరని పోలీసులు తెలిపారు.

## యువత క్రీడాల్లో రాణించాలి

**వేమనపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని నీల్వాయి పోలీసులు తెలిపారు. రూరల్ సీఐ బన్సిలాల్ ఆదేశాల మేరకు ఇంచార్జి ఎస్సై శ్యాం పటేల్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎబినైజర్ నీల్వాయి యువకులకు వాలీబాల్ కిట్ అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, పోలీస్ నూతన చట్టాలు, రవాణా చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గేమింగ్ యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు, ఇతర వివరాలను తెలుపవద్దన్నారు. వీరితో కానిస్టేబుల్ ప్రకాష్, దాము కానిస్టేబుల్ స్థానిక యువకులు పాల్గొన్నారు.



## పలువురిని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకుడు రాంకిషన్ రెడ్డి

**సారంగాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

సారంగాపూర్ మండల పరిధిలోని కౌట్ల, దేవి తండా గ్రామాల్లో పలు కుటుంబాలు ఇటీవల ప్రియమైన వారిని కోల్పోయాయి. కౌట్ల గ్రామానికి చెందిన మెరుగు వెంకట్ రెడ్డి తల్లి మెరుగు లస్మవ్వ ఐదు రోజుల క్రితం, దేవి తండా గ్రామానికి చెందిన జాదవ్ ప్రకాష్ తండ్రి జాదవ్ గంగారం రెండు రోజుల క్రితం మరణించారు. బాధాకర ఘటన అని వారి కుటుంబలకు ప్రగాఢ సానుభూతి తెలిపినాడు. టీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాంకిషన్ రెడ్డి ఆయనతోపాటు టిఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్, శ్యామ్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, వంగ చంద్రశేఖర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఇల్లు కాలిన పేద కుటుంబానికి అండగా నిలిచిన పోలీసులు

**- రెహమాన్ ఫౌండేషన్ ఆపన్నహస్తం అందజేత - నిందితుడిపై కఠిన చర్యలు తప్పవు ఎస్ఐ గంగన్న**

**లింగాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



మండలంలోని ఎల్లాపాటర్ గ్రామంలో భార్యపై కోపంతో ముజాయిజ్ బెగ్ అత్తింటికి నిప్పు పెట్టడంతో బాధితురాలు, షమాబి కుటుంబం నిర్భంద స్థితికి చేరింది. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఎస్.ఐ. సిహెచ్. గంగన్న. రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ, సహకారంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 10,000 విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. లింగాపూర్ ఎస్.ఐ. గంగన్న మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. డాక్టర్ షేక్ అబ్దుల్ రెహమాన్ జిలానీ గారు మాట్లాడుతూ, మానవతా సేవ మన ధర్మం ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితురాలికి సహాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ పోలీస్ సిబ్బంది, రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు, సామాజిక సేవకుడు జాటోత్ దవిత్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్థానికులు పోలీసుల సేవా హృదయాన్ని, ఫౌండేషన్ మానవతా దృక్పథాన్ని అభినందించారు.

## బెల్లంపల్లిలో అక్టోబర్ 26న మెగా జాబ్ మేళా

**జాబ్ మేళా కొరకు క్రీడా మైదానాన్ని పరిశీలించిన మందమర్రి జిఎం**



**బెల్లంపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

బెల్లంపల్లిలో మెగా జాబ్ మేళ-2025 కోసం ఏఎంసీ క్రీడా మైదానాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ ఆదేశాల మేరకు ఈ నెల 26 తేదీన బెల్లంపల్లి పట్టణంలోని ఏ.ఎం.సీ మైదానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు సింగరేణి సంస్థ, నోబల్ ఎంపవరమెంట్, వారిచే సంయుక్తంగా మెగా జాబ్ మేళా-2025 ను నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు, మందమర్రి, బెల్లంపల్లి, పరిసర ప్రాంతాలలోని సుమారు 7000 మంది నిరుద్యోగ యువత రానున్నట్టు వారు సూచన ప్రాయంగా తెలియచేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏ.ఎం.సి మైదానాన్ని వారు పరిశీలించారు. ఈ జాబ్ మేళాకు వచ్చే ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పలు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి.ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీ.జీ.ఎం ఎఫ్ అండ్ ఏ ఆర్. వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, వి.టి.సి మేనేజర్ శంకర్, డీజీఎం ఈ అండ్ ఎం దూప్ సింగ్, సివిల్ ఎస్.ఈ రాము, ఏరియా సర్వే ఆఫీసర్, బి.దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మద్యం దుకాణలకు టెండర్లు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు చేపట్టిన టెండర్లు శనివారం ముగిసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా కొనసాగిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన్నట్లు తెలిపారు. శనివారం సమయం ముగిసే వరకు కొమరం భీం జిల్లా వ్యాప్తంగా ఒక్క రోజుకు 32 మద్యం దుకాణలకుగాను 130 దరఖాస్తులు వచ్చాయాని, మరికొందరు లైన్‌లో ఉన్నారన్నారు. మొత్తంగా 2025-27 సంవత్సరానికి గాను నూతమద్యం దుకాణాల ఏర్పాటుకు 510 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 23న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్కీ డ్రా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్కారీ శాఖ అధికారులు అక్బర్ హుస్సేన్, రమేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## లక్కీడ్రా పద్ధతిన గురుకుల పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

**- మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్**

**నస్పూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



జిల్లాలోని గురుకుల పాఠశాలలలో ఖాళీగా ఉన్న సీట్లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేసి భర్తీ చేయడం జరిగిందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని గురుకుల బాలికల పాఠశాలలలో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు 74 సీట్లు ఖాళీగా ఉండగా 37 సీట్లను భర్తీ చేయడం జరిగిందని, బాలుర గురుకుల పాఠశాలలలో 89 సీట్లు ఖాళీగా ఉండగా 38 సీట్లను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 3 సార్లు పరీక్ష రాత పద్ధతిలో ఎంపిక చేయడం జరిగిందని, చివరిగా సీట్ల భర్తీకి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

**జైపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



మండల కేంద్రంలో శనివారం బిఆర్ఎస్ శ్రేణులు బాల్క సుమన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరవిందరావు,రిక్కుల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.పటాకులు కాల్చుతూ జై బీఆర్ఎస్, జై బాల్క సుమన్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అరవిందరావు,రిక్కుల మధుకర్ రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడిగా కీలక పాత్రను పోషించిన బాల్క సుమన్ తెగువ యువతకుస్ఫూర్తిదాయకమన్నారు. పెద్దపల్లి ఎంపీగా, చెన్నూర్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి సుమన్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు రాజయ్య, రంగన్న, నామాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రామాటేంకి లింగుస్వామి, నాయకులు రాయమల్లు, మల్ల గౌడ్, యూత్ నాయకులు సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కిసాన్ యాప్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**లక్షెట్టిపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



పత్తి పంట పండించినటువంటి రైతులందరూ పత్తి కొనుగోలు సిసిఐ వారు కేవలం కపాస్ కిసాన్ యాప్ ద్వారా మాత్రమే చేపడతారని మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్ తెలిపారు. దీని కొరకు ప్రతి రైతు యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం, స్లాట్ బుక్ చేసుకోవడం ఉంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వ్యవసాయ శాఖ వారు ఆటోమేటిక్‌గా చేస్తున్నారు. కాకపోతే గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు మీ గ్రామానికి వచ్చినప్పుడు మీ యొక్క మొబైల్ నెంబర్ సరి చూసుకోవడం తప్పనిసరి. మొబైల్ నెంబర్ సరిగా ఉన్న రైతులకు మాత్రమే ఆ తరువాత స్టెప్ అయినటువంటి స్లాట్ బుకింగ్ యాప్ ద్వారా చేయడం వీలవుతుంది. కావున ప్రతి రైతు తప్పనిసరిగా ఏఇవో మీ గ్రామాన్ని సందర్శించినప్పుడు మీ యొక్క మొబైల్ నెంబర్ సరిచూసుకోగలరు. యాప్‌కి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కూడా ఒక పిడిఎఫ్ ఫైల్‌లో జతపరుస్తున్నాము. కావున చూసుకోగలరు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం... అన్నిదాలకంటే అన్నదానం గొప్పది

**బెల్లంపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో శనివారం రోజున కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అమ్మ ఒడి ఎన్‌జిఒ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం నిర్విరామంగా కొనసాగించాలనే సదుద్దేశంతో 2020 సంవత్సరంలో ప్రారంభించబడి దానికి కొనసాగింపుగా ఈరోజున బెల్లంపల్లి పట్టణంలో అన్నమో రామచంద్ర అని అలమటించే ఎందరో ఆకలి తీరుస్తూ బెల్లంపల్లి పట్టణంలో 341వ వారాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈరోజు కీశే రాజేష్ కార్వ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు మరియు విజయ్ ఆటో స్టోర్ స్టాఫ్ వారి సహకారంతో అన్నదాన కార్యక్రమము యాచకులకు, నిరుపేదలకు, దినసరి అడ్డ కూలీలకు, బాటసారులకు సుమారు 200 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్ మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ అమ్మఒడి అన్నదాత ప్రాజెక్టులో భాగంగా 341వ వారల సందర్భంగా అన్నదాన కార్యక్రమం విజయవంతంగా సాగిందని, ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు గందు సంపత్, కొమ్మురెడ్డి వెంకటేష్, రాకేష్, రమేష్, భాస్కర్, బొమ్మకంటి బాలకృష్ణ, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, హనుమాండ్ల మల్లక్క, సిద్దమల్ల రఘు, ఎండి యుసుఫ్, చెందు పట్ల లింగమూర్తి పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమం కోసం న్యాయ సేవల కేంద్రం ఏర్పాటు

**- సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజా**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో న్యాయ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజా తెలిపారు. శనివారం రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి న్యాయ సేవల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ట్రిబ్యునల్స్ ఎస్టాబ్లిష్డ్ అండర్ మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ ఆక్ట్ 2007 క్రింద వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లాలో న్యాయ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వయవృద్ధులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించేందుకు ఈ కేంద్రం ద్వారా కృషి చేయడం జరుగుతుందని, దీని కోసం పానెల్ న్యాయవాదిగా కుడ్క కిషోర్, పారా లీగల్ వాలంటీర్‌గా సునర్కర్ లింగయ్యలను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం ద్వారా సేవలు పొందవచ్చని తెలిపారు. చట్టంలోని అంశాలను వయోవృద్ధులకు వివరించడం జరుగుతుందని, అవసరమైన సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: ఎమ్మెల్యే

**కాగజ్‌నగర్, ప్రభాతవార్త**



విద్యార్థి జీవితంలో కళాశాల చదువు అత్యంత కీలకమని, విద్యార్థులు శ్రద్ధగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించిన వసుంధర జూనియర్,డిగ్రీ కళాశాల ప్రేషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు హాజరయ్యారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదల కళాశాల స్థాయి నుంచే ప్రారంభం అవుతుందని,ఈ వయస్సులో మొబైల్ ఫోన్లకు, సోషల్ మీడియాకు, చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చదువు మీద శ్రద్ధ పెట్టి భవిష్యత్తులో మంచి స్థాయిలో నిలబడి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మెమంటోలు అందజేశారు. అంతకు ముందు ఫ్రేషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.